మరమ్మతులకు నిధులు మంజూరు

- వరదలతో నాగిరెడ్డిపేట మండలంలో ధ్వంసమైన చెరువులు, కుంటలు
- పలుచోట్ల కోతకు గురైన పోచారం ప్రధాన కాలువ
- 21 పనులు.. రూ.కోటి 4 లక్షల 81 వేలు
- కొనసాగుతున్న మరమ్మతు పనులు



నాగిరెడ్డిపేట సమీపంలో పోచారం ప్రధాన కాలువకు ఇరువైపులా వేసిన మొరం కట్టలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గత ఆగస్టు నెలాఖరులో జిల్లాను అతలాకుతలం చేసిన భారీ వర్షాలు నాగిరెడ్డిపేట మండలంలో సైతం చెరువులు, కుంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. మండలంలోని పోచారం ప్రధానకాలువ పలుచోట్ల కోతకు గురై ధ్వంసమైంది. దెబ్బతిన్న చెరువులు, కుంటలతోపాటు పోచారం ప్రధానకాలువను పునర్నిర్మించేందుకు ప్రభుత్వం ఇటీవల ఎస్‌డీఆర్‌ఎఫ్, ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్ ద్వారా నిధులను సైతం విడుదల చేసింది. ఈ మేరకు నాగిరెడ్డిపేట మండలంలో మొత్తం 21 పనులకు రూ.కోటి 4 లక్షల 81 వేల నిధులను మంజూరు చేసింది. వాటిలో కొన్ని పనులు పూర్తవగా మరికొన్ని పనులు పురోగతిలో ఉన్నాయి. ఇంకొన్ని పనులు ప్రారంభం కావాల్సి ఉంది.

నీటి విడుదలకు సిద్ధంగా 'పోచారం' కాలువ..

ఇటీవల జిల్లాలో సంభవించిన వరదల కారణంగా నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రధాన కాలువ పలు చోట్ల ధ్వంసమైంది. దీంతో పోచారం ప్రధానకాలువ నీటిపై ఆధారపడి సాగవుతున్న పంటలను కాపాడేందుకు అధికారులు యుద్ధ ప్రాతిపాదికన మరమ్మతు పనులు చేపట్టారు. కాగా తరుచూ కురుస్తున్న వర్షాలతో ప్రధానకాలువ మరమ్మతులకు కొంతమేర ఆటంకం కలిగింది. అయినా ఎట్టకేలకు ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చి ప్రధాన కాలువ మరమ్మతులను పూర్తి చేసి ప్రాజెక్టు నుంచి నీటి విడుదలకు కాలువను సిద్ధం చేశారు.

సుమారు రూ.50 లక్షలతో కాలువకు మరమ్మతులు..

పోచారం ప్రధాన కాలువను సుమారు రూ.50 లక్షల నిధులతో అధికారులు మరమ్మతు పనులు పూర్తి చేశారు. మాల్తుమ్మెద గ్రామ శివారులోని పోచారం ప్రధాన కాలువ రెండు చోట్ల ధ్వంసమైంది. వీటిలో ఒకచోట రూ.9.9లక్షలతో, మరో చోట రూ.4 లక్షలతో కాలువకు మరమ్మతు పనులు చేపట్టారు. దీంతోపాటు నాగిరెడ్డిపేట సమీపంలోని పటేల్ చెరువు కట్ట తెగిపోయి ధ్వంసమైన పోచారం ప్రధాన కాలువకు రూ.33.07లక్షలతో మరమ్మతు పనులు పూర్తి చేశారు. వీటికితోడు పలుచోట్ల దెబ్బతిన్న పోచారం ప్రధానకాలువ కట్టకు ఎస్‌డీఆర్‌ఎఫ్ నిధులతో మరమ్మతు పనులను ప్రారంభించారు. కాగా ఎస్‌డీఆర్‌ఎఫ్ నిధులతో నాగిరెడ్డిపేట మండలంలో మొత్తంగా రూ.25 లక్షల 62 వేలతో 16 పనులు చేపట్టనున్నారు. దీంతోపాటు 68.12లక్షలతో మరో 11 పనులు చేపట్టేందుకుగానూ ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

ఉపాధి హామీ ఈ–కేవైసీని వేగవంతం చేయాలి

- డీఆర్‌డీవో సురేందర్



తాడ్వాయి మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఆర్‌డీవో సురేందర్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఉపాధి హామీ కూలీలకు సంబంధించి ఈ–కేవైసీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని డీఆర్‌డీవో సురేందర్ అన్నారు. తాడ్వాయి ఐకేపీ కార్యాలయంలో మంగళవారం ఉపాధి హామీ, ఐకేపీ సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. మండలంలో ఈ–కేవైసీ అతి తక్కువ మంది చేసుకున్నారని, సిబ్బంది చొరవ తీసుకొని పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే రైతులకు ఉపయోగపడే పనులను ఉపాధి పనులుగా తీసుకోవాలన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో రైతులకు ఉపయోగపడే కాటిల్, గొర్రెల షెడ్లులను వేయించాలన్నారు. బ్యాంకులు, స్త్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలను రికవరీ చేయించాలన్నారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఐకేపీ ఏపీఎం రాజు, ఏపీవో కృష్ణ గౌడ్, మండల సమాఖ్య అధ్యక్షులు సుజాత, అకౌంటెంటు తిరుపతిరెడ్డి, స్త్రీనిధి ప్రతినిధి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. కబ్జాదారులకు వరం

- విచ్చలవిడిగా అసైన్డ్ భూముల కబ్జా
- ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామంటున్న అధికారులు



రాజమ్మతండా రోడ్డులో కబ్జా అవుతున్న భూమి

రామారెడ్డి: రామారెడ్డి గ్రామం మండల కేంద్రంగా మారడంతో పది గజాల భూమి ఉన్నా అక్రమార్కులు వదలడం లేదు. ఇటీవల రాజమ్మ తండాకు వెళ్లే మార్గంలో ఎర్రకుంటనే కబ్జా చేసే ప్రయత్నం చేయడంతో సాక్షి వెలుగులోకి తెచ్చి కబ్జానా అడ్డుకోగా.. తాజాగా అదే మార్గంలో అసైన్డ్ భూములను, గుట్టలను కొందరు యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. తమ పేరు మీద ఎకరం భూమి ఉంటే పక్కన ఎంత అసైన్డ్ భూమున్నా.. ఉన్నదంతా ఊడ్చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు మాత్రం మామూళ్లు తీసుకొని మిన్నకుండిపోతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. భూకబ్జాలపై రెవెన్యూ అధికారుల వివరణ కోరితే.. ఎవరైనా వచ్చి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూములను రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

పుస్తకాల విరాళం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి శాఖా గ్రంథాలయానికి ఓ ఉపాధ్యాయుడు పుస్తకాలను విరాళంగా అందజేశారు. మండలంలోని కృష్ణాజీవాడి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గిర్మిబోయి.. తెలంగాణా చరిత్ర, తెలంగాణా ఆర్థిక వ్యవస్థ, తెలంగాణా ఆర్థిక అభివృద్ధి, పర్యావరణం, భాగవత కథలు తదితర పుస్తకాలను ఇన్‌చార్జి గ్రంథపాలకుడు రాజలింగంకు అందజేశారు. గతంలో కూడా గర్మిబోయి గ్రంథాలయానికి పుస్తకాలను విరాళంగా అందజేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



బిచ్కుంద(జుక్కల్): స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా దేవాడ, పుల్కల్, వాజిద్‌నగర్ తదితర గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను మండల ప్రత్యేక అధికారి, జిల్లా మైన్స్ అధికారి నగేష్, ఎంపీడీవో గోపాల్ మంగళవారం పరిశీలించారు. వికలాంగులు, వృద్ధులకు ఇబ్బందులు కలగకుండా, ఎన్నికలు సజావుగా జరిగేవిధంగా ఎలాంటి జాగ్రత్తలు, సౌకర్యాలు కల్పించారో ఎంపీడీవో, ఎంపీవోలతో మాట్లాడి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. పోలీసులు సమస్యాత్మక గ్రామాలను గుర్తించారు.

ఎల్లారెడ్డి పరిధిలో..



ఎల్లారెడ్డిరూరల్: హాజీపూర్, లక్ష్మాపూర్ గ్రామాలలో గల పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో ప్రకాష్ మంగళవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో లైటింగ్, ఫ్యాన్లు ఇతర సదుపాయాలు సరిగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే వాటిని పరిష్కరించాలని బీఎల్‌వోలకు సూచించారు.

బీసీ రిజర్వేషన్లు అడ్డుకుంటే ఊరుకోం



కామారెడ్డి టౌన్: బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటే ఊరుకునేది లేదని బీసీ సంక్షేమ సంఘం నాయకులు హెచ్చరించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ముందు జ్యోతీరావు పూలే విగ్రహానికి వినతి పత్రం అందజేసి నిరసన తెలిపారు. కొన్ని వర్గాలు బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవడం సరికాదని నేతలు అన్నారు. నేతలు నాగరాజు, శివరాములు, మోహనాచారీ, అబ్దుల్, మల్లన్న, నర్సయ్య, రాజలింగం తదితరులున్నారు.

డాక్టరేట్ పట్టా ప్రదానం



లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండలం శెట్పల్లి గ్రామానికి చెందిన పిల్లి సురేష్ మంగళవారం డాక్టరేట్ పట్టా అందుకున్నారు. జుక్కల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న సురేష్ తెలుగు విభాగంలో 'నిజామాబాదు జిల్లా కథ సాహిత్యం' అనే అంశంపై పరిశోధన చేసినట్లు ఆయన తెలిపారు. హైదరాబాదులోని కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మ, వైస్ చాన్స్‌లర్ బీజే రావు చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా ప్రదానం చేసినట్లు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు



సాక్షి ఎఫెక్ట్..

మాచారెడ్డి: చుక్కాపూర్‌లో వ్యవసాయ మోటార్లకు విద్యుత్‌ను సరఫరా చేసే మినీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ట్రాన్స్‌కో అధికారులు మంగళవారం బిగించారు. ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయినా అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఈ నెల 5న 'సాక్షి' దినపత్రికలో కాలిపోయిన మినీ ట్రాన్స్‌ఫార్మర్.. పట్టించుకోని అధికారులు' శీర్షికన ప్రచురితమై కథనానికి ట్రాన్స్‌కో అధికారులు స్పందించి మంగళవారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చారు.

జస్టిస్ గవాయ్‌పై దాడిని ప్రతిఒక్కరు ఖండించాలి



శేరిబీబీపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలు



ఎల్లారెడ్డిలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కామారెడ్డి అర్బన్: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆకుల బాబు, సాయిలు ఒక ప్రకటనలో తెలిపారు. కులం, మతం, సనాతన ధర్మం పేరిట దేశమంతటా దాడులు జరుగుతున్నాయని, ప్రజాస్వామ్యం, న్యాయవ్యవస్థ పట్ల ఏమాత్రం గౌరవం లేని ప్రత్యక్ష, పరోక్ష దాడులు ఆందోళన కల్గిస్తున్నాయన్నారు.

గవాయ్‌పై దాడిని ప్రతిఒక్కరు ఖండించాలని, దాడికి పాల్పడ్డ వ్యక్తిని కఠినంగా శిక్షించాలని టీఎస్ యూటీఎఫ్ నాయకులు రాజవర్ధన్, సాయిగౌతమ్, నారాయణ, నాంపల్లి, బాలయ్య, రత్నం, రామకృష్ణ అన్నారు.

బీబీపేట: సుప్రీంకోర్టు సీజేపై దాడిని నిరసిస్తూ శేరి బీబీపేటలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. దాడికి ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అంతే కాకుండా బీబీపేట, మాందాపూర్‌లో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు.

మాచారెడ్డి: సుప్రీంకోర్టు సీజేపై దాడికి వ్యతిరేకంగా పాల్వంచ మండలం ఫరీద్‌పేటలో ఎమ్మార్పీఎస్, అంబేడ్కర్ యువజన సంఘం నేతలు మంగళవారం నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. నేతలు బాల్‌రాజు, స్వామి, వెంకట్‌రాములు, నర్సింలు, లింగం, స్వామి, దేవరాజు, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

కోర్టు విధుల బహిష్కరణ

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో మున్సిఫ్ కోర్టు న్యాయవాదులు మంగళవారం కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ వారు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్‌రావు, శ్రీనివాస్, శ్రీకాంత్, పండరి, సతీష్, సాయిబాబా తదితరులున్నారు.

ఇది ముమ్మాటికీ రాజ్యాంగంపై దాడే



కామారెడ్డిటౌన్: మాట్లాడుతున్న న్యాయవాదులు



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు, ప్రజా సంఘాల నేతలు

కామారెడ్డి టౌన్: సుప్రీం కోర్టు సీజే బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి ముమ్మాటికి రాజ్యాంగంపై దాడిగా భావిస్తున్నట్టు కామారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద రమేష్ అన్నారు. మంగళవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి జిల్లా కేంద్రంలోని అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ దాడిని న్యాయవ్యవస్థ తరుపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. న్యాయవాదులు జగన్నాథం, శంకర్‌రెడ్డి, వెంకట్రామ్‌రెడ్డి, క్యాతం సిద్దిరాములు, మురళీ, సురేందర్‌రెడ్డి, గోవింద్‌రావు, వేణుగోపాల్, ఆజాద్, వేణుప్రసాద్ తదితరులున్నారు. అలాగే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలోని అంబేడ్కర్ విగ్రహం ముందు నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

బీఆర్‌ఎస్ నేతను బెదిరించినందుకు రాస్తారోకో



తాడ్వాయిలో రాస్తారోకో చేస్తున్న నాయకులను సముదాయిస్తున్న పోలీసులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): బీఆర్‌ఎస్ నాయకుడిని ఎస్సై ఫోన్ చేసి బెదిరించినందుకు నిరసన తెలుపుతూ తాడ్వాయి మండల కేంద్రంలోని కామారెడ్డి –ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై మంగళవారం బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు రాస్తారోకో చేశారు. ఈసందర్భంగా బీఆర్‌ఎస్ నేతలు మాట్లాడుతూ.. సంగోజీవాడి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు తాజొద్దీన్ సోషల్ మీడియాలో వచ్చిన వార్తను మరొక వాట్సాప్ గ్రూప్‌లో పెట్టాడని, ఇది చూసిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్సై మురళికి ఫోన్ చేసి సమాచారాన్ని అందించాడన్నారు. దీంతో ఎస్సై ఆ నేతకు ఫోన్‌చేసి బెదిరించి పోలీసు స్టేషన్‌కు రావాలని హెచ్చరించారన్నారు. దీంతో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తాడ్వాయికి తరలి వచ్చి పోలీసు స్టేషన్ ఎదురుగా రాస్తారోకో చేశారు. ఒక గ్రూపులో వచ్చిన వార్తను మరొక గ్రూపులో పెడితే తప్పేంటని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చే దమ్ములేదు కాని సామాన్యులను బెదిరించడం ఎంతవరకు సమంజసమన్నారు. ట్రాఫిక్ జాం కావడంతో పోలీసులు వచ్చి వారిని సముదాయించి రాస్తారోకోను విరమింపజేయించారు.

ఘనంగా స.హ.చట్టం వారోత్సవాలు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో మంగళవారం సమాచార హక్కు చట్టం(స.హ.చట్టం) 20వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ సలీం మాట్లాడుతూ.. స.హ.చట్టం వజ్రాయుధం లాంటిదని పేర్కొన్నారు. చట్టాలపై అవగాహన కల్పించారు. కరపత్రాలను ఆవిష్కరించారు. తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్సై పుష్పరాజ్, ప్రిన్సిపల్ రాజిరెడ్డి, పరిరక్షణ కమిటీ జిల్లా సలహాదారుడు విజయకుమార్, ప్రతినిధులు శ్రీనివాసరావు, సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శరత్ పౌర్ణమి, నవదుర్గా వ్రతం



కామారెడ్డి అర్బన్: కోజాగరి కౌముది శరత్ పౌర్ణమి సందర్భంగా మంగళవారం ఉదయం స్థానిక శారదామాత ఆలయంలో సామూహిక నవదుర్గా వ్రతం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సాయంత్రం పౌర్ణమి వెలుతురులో శ్రీమహాలక్ష్మి అమ్మవారికి విశేషపూజ, అభిషేకం, పాలలో దర్శనం నిర్వహించారు. దేవునిపల్లి శ్రీరమా సత్యనారాయణ స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతం చేపట్టారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలి



కామారెడ్డి టౌన్: ప్రతి ఒక్కరు డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలని పట్టణ ఎస్సై రాజారాం తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని లయోల పాఠశాలలో కామారెడ్డి పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. షీటీం, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలు, బాల్య వివాహాలు, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్, మద్యం సేవించి డ్రైవింగ్, రోడ్డు ప్రమాదాలు, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీస్ కళాబృందం సభ్యులు, పోలీసులు ప్రవీణ్, సౌజన్య, పాఠశాల యజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ జాగృతిలో నాయకుల చేరిక



కామారెడ్డి టౌన్: జిల్లాకు చెందిన నాయకులు తెలంగాణ జాగృతిలో చేరారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో అధ్యక్షులు కవిత సమక్షంలో బీఎస్పీ జిల్లా నేత సురేష్ గౌడ్, బీజేపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు తలారి బాల్‌రాజులు చేరారు. వారికి పార్టీ కండువాలను కప్పి ఆమె ఆహ్వానించారు. నాయకుడు సంపత్‌కుమార్‌గౌడ్ తదితరులున్నారు.

వానా కాలం కోతలు షురూ..!



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేసిన వరిపంటల కోతలు మొదలయ్యాయి. బోరుబావుల వద్ద ముందస్తుగా వేసిన పంటలు ప్రస్తుతం కోతకు వచ్చాయి. ఒక వైపు పంటలు కోతకు రాగా మరోవైపు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పంటలను కాపాడుకునేందుకు రైతన్నలు నానా అవస్థలు పడుతున్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా?



దోమకొండలోని పెద్దమ్మ కాలనీ వద్ద కోతకు గురై ప్రమాదకరంగా మారిన రోడ్డు

దోమకొండ: మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయ కాలనీవాసులు ప్రమాదం అంచున నిత్యం ప్రయాణం చేస్తున్నారు. బస్టాండ్ నుంచి కాలనీకి వెళ్లే దారి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నది. రోడ్డు భారీగా కోతకు గురై గుంత ఏర్పడింది. దీంతో కాలనీకి చెందిన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదుపు తప్పితే కిందపడే అవకాశముంది. ద్విచక్ర వాహనాలు మాత్రమే ఒకవైపు నుంచి వెళ్లే పరిస్థితి ఉందని, కార్లను ఇంటివద్దకు తీసుకువచ్చే పరిస్థితి లేదని కాలనీవాసులు వాపోతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.

కుమురం భీమ్‌కు ఘన నివాళి



హన్మాజీపేట్‌లో నివాళి అర్పిస్తున్న ఆదివాసీలు



బూర్గుల్‌లో..

నిజాంసాగర్/బాన్సువాడ రూరల్: తెలంగాణ విముక్తి కోసం నైజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన గిరిజనోద్యమ నాయకుడు కుమురం భీమ్ వర్ధంతిని మహమ్మద్‌నగర్ మండలం బూర్గుల్‌లో, బాన్సువాడ మండలం హన్మాజీపేటలో ఆదివాసీ నాయక్‌పోడ్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం నేతలు మాట్లాడుతూ.. జల్ జంగల్ జమీన్ నినాదంతో నాటి నిరంకుశ పాలకుల గుండెల్లో భయం పుట్టించిన నేత కుమురం భీం అని అన్నారు. కుమురం భీం ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపడానికి జీవితాంతం పోరాటం చేసి ప్రాణత్యాగం చేశారని ఆయన సేవలను గుర్తు చేశారు. అడవి బిడ్డల హక్కుల కోసం పిడికిలెత్తి పోరాటం చేసిన వీరుడని కొనియాడారు.

రుణాలను సకాలంలో చెల్లించాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): రుణాలను సకాలంలో చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని ఉత్తనూర్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ సురేందర్ రెడ్డి సూచించారు. మంగళవారం బ్యాంకులో గ్రామ సంఘాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. మహిళా సంఘాల సభ్యులకు బీమా సదుపాయం ఉంటుందన్నారు. ప్రమాదంలో మరణిస్తే రూ.10 లక్షల బీమా సదుపాయం కల్పిస్తుందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి జీవనజ్యోతిని కూడా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళా సంఘం అధ్యక్షులు బాలంబాయ్, ప్రతినిధులు లావణ్య, ఫీల్డ్ ఆఫీసర్ శ్రావణ్ కుమార్, సీసీలు భూమయ్య, నరేందర్ రెడ్డి, వీవోఏలు పాల్గొన్నారు.

సంక్షిప్తం

పంటల పరిశీలన



గాంధారి(ఎల్లారెడ్డి): తిప్పారం, బూర్గుల్ శివార్లలో మంగళవారం క్షేత్ర స్థాయిలో పంటలను ఏవో రాజలింగం పరిశీలించారు. వరి, పత్తి పంటలకు సంబంధించి సస్యరక్షణ కోసం పలు సూచనలు, సలహాలిచ్చారు.

నేడు ఎల్లారెడ్డిలో విద్యుత్ అంతరాయం

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ వెంకటస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతు పనులలో భాగంగా ఎల్లారెడ్డి పట్టణంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు.

పాఠశాల తనిఖీ



లింగంపేట(ఎల్లారెడ్డి): ఎల్లారం ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంఈవో షౌకత్‌అలీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పరిశీలించారు. పలు సూచనలు, సలహాలిచ్చారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

బాన్సువాడ రూరల్: చిన్నరాంపూర్ గ్రామానికి చెందిన కురుమ మారుతి అనే వ్యక్తి 3 నెలల క్రితం గుండెపోటుతో మరణించాడు. పేదకుటుంబం కావడంతో ఆర్థిక పరిస్థితిని గమనించి మంగళవారం బాన్సువాడ డివిజన్ కురుమ సంఘం తరపున వారి కుటుంబానికి రూ.11 వేల ఆర్థిక సాయం అందించారు. నాయకులు పర్వగౌండ, గంగుల గంగారాం, రమేష్, సాయినాథ్, బీరప్ప, రఘు పాల్గొన్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలి



రామారెడ్డి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని మండల కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షుడు పిప్పరి గణేష్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో రామారెడ్డి మండల కాంగ్రెస్ యువజన విభాగాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా జాషువా, ఎండీ అద్నాన్, ప్రధాన కార్యదర్శిగా పండ్ల నిశాంత్, కార్యదర్శులుగా సీహెచ్ రమేష్, జి.రంజిత్, కోశాధికారిగా సురేందర్, తదితరులను ఎన్నికయ్యారు. రామారెడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రవీణ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎండీ రవూఫ్, తదితరులు పాల్గొన్నారు.